# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

కపిలేశ్వరపురం హెడ్ మాస్టరుగారు కాంపౌండు లోంచి స్కూలులోకీ, స్కూలు లోంచి కాంపౌండులోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నారు.

వార్షికోత్సవం!

తాను కొత్తగా హెడ్ అయిన తర్వాత జరిగే మొట్టమొదటి ఉత్సవం యిదే. ఏం రసాభాస అవుతుందో అని భయం. కారణం అనుకున్న అధ్యక్షులు రాలేదు. కనుచూపు మేరలో కూడ వస్తూన్న జాడ కనిపించడం లేదు.

ఏం దారి?

నేనభయ మిచ్చాను. డాక్టరుగారు పిడుగులు పడినా రావడం మానరు. చాల నిక్కచ్చి అయిన మనిషి. మీరు 'విఘ్నేశ్వర' పూజ కానిస్తూ ఉండండి. అంటే- సెక్రటరీ రిపోర్టు, దండలు, శాలువాలు రంగంమీదికి చేర్చడం. ప్రార్థనకు ఆడపిల్లల్ని సిద్ధం చెయ్యడం వగైరా అన్న మాట

అసలు రహస్యం ఏమిటంటే- హెడ్ మాస్టరుగారు నా ద్వారానే. డాక్టరు కనకరాజు, ఎఫ్. ఆర్. సి ఎస్. (ఇ) గారిని అధ్యక్షులుగా వరించారు. డాక్టర్ మంచి వక్త, ఖులాసా మనిషి. ఆవకాయ దగ్గర్నుంచి అమెరికా రాజకీయాలదాకా అనర్గళంగా మాట్లాడగలరు.

నాకు ముఖ్య స్నేహితులు.

అంతెత్తు మనిషిని తన హయాంలో అధ్యక్షులుగా ఉంచి సభ జరపడం ప్రధానోపాధ్యాయులవారి ప్రథమ కాంక్ష!

డాక్టరుగారు రాజమండ్రినుంచి రావాలి. రాలేదు. సభ 5 గంటలకు. 5-30 అయింది. అందాకా పసుపు విఘ్నేశ్వరుడులా హెడ్ మాస్టరు అధ్యక్షస్థానంలో కూర్చున్నారు.

చూపులు రోడ్డు మీద-

ఆడపిల్లల అపస్వరాల స్వరమేళనంతో ప్రార్థన అయింది.

కారు ఝర్రుమని వచ్చి స్కూలుముందు ఆగింది. హెడ్‌మాస్టరుగారు కుర్చీకి స్ప్రింగ్ వున్నట్టు ఎగిరిపడి వరండా మీదకు వచ్చారు

డాక్టరుగారు కారు దిగారు.

"తన వెంటన్ సిరి లచ్చి వెంట నవరోధ వ్రాతమున్" అన్నట్టు వెంట లచ్చి లేదుగాని, ఒక లక్ష్మీపుత్రుడు, సరస్వతీ పుత్రుడూ వున్నారు.

కనకరాజుగారు నవ్వుతూ అందర్నీ పలకరించి "రాజు వెడలె సభకు" అనిపించారు.

స్వాగతవచనా లయాయి.

డాక్టరుగారు ఆపరేషన్‌లో యెంత హస్తలాఘవం గలవారో అధ్యక్ష పీఠ నిర్వహణంలో కూడా అంత కృతహస్తులు!

లాంఛనోపన్యాసాలు జరిగాయి. డాక్టరుగారు లేచి ఖులాసాగా 20నిమిషాలు మాట్లాడి, మైనరాపరేషన్‌లాగా హేలగా ముగించారు. అంతకు ముందుగా స్కూలు

## బొమ్మలాట

తెలుగు పండితుడు కనకరాజుగారి ముఖం ఎరక్కపోయినా- 'నవరత్నాలు' చదివి సభక్తికంగా సమర్పించాడు.

డాక్టరుగారు తమాషా మనిషి. తెలుగు పండితుడితో తెలుగు సాహిత్యంగురించీ, క్రికెట్ ఆటగాడితో క్రికెట్ పరుగుల గురించీ నిరర్గళంగా మాటాడగలరు.

అధ్యక్షుడినుంచి నావరకూ అతిథులకు హెడ్‌గారు తలో ఖద్దరుశాలువా బహూకరించారు. డాక్టరుగారు ఖరీదయిన సూటు మీద ఖద్దరుశాలువా అంతర్జాతీయ అవగాహనకు దాఖలాలా వుంది.

తెలుగు పండితుడు డాక్టరుగారి వెంట పడ్డాడు. డాక్టరుగారితో ఎప్పటికేనా పని ఉండక పోతుందా అని- కనకరాజుగారికి ఒక విదూషకుడు దొరికితే చాలు- ఆట పట్టించడం మహా సరదా—

సత్రంలో బ్రహ్మాండమైన డిన్నరు ఏర్పాటుచేశారు. సత్రం హాలులో చేరాం.

డాక్టరుగారు తెలుగు పండితుడితో "అయ్యా, మీ నవరత్నాలకేంగాని మీరు వెనక రాసిన నాలుగు మంచి పద్యాలు చదవండి" అన్నారు. తెలుగుపండితుడు అడగడమే తడవు అందుకుని రాగయుక్తంగా 10 పద్యాలు చదివాడు. ఇందాక చదివిన వాటికీ వీటికీ పోలిక లేదు. డాక్టరుగారు కొంటె మనిషి. "ఈ పద్యాలు మీరు రాసినవేనా అన్నంత బాగున్నాయండీ. వెనకటికి ఒక డన్నాట్ట, మీరు రాసిన రెండు త్యాగరాజ కీర్తనలు పాడమని- అన్నట్టుంది." అందులో వ్యంగ్యం ఆ శ్రోత్రియ పుత్రుడు గ్రహించలేదు. ఆ పద్యాలు పాపయ్యశాస్త్రి 'విజయశ్రీ'లోవి. ఈయనేం కనిపెట్టగలరు? అనుకున్నాడుగాని డాక్టరుగారు దేవాంతకుడు!

సర్వేశాం.

ఆయన కబుర్ల పోగు. డిన్నరులో పదార్థాలకన్న కబుర్లే ఎక్కువతిని పొట్ట ఉబ్బిపోయాయి. వెంటనే తిరుగుప్రయాణం. మండపేటలో పని చూచుకు రాజమండ్రీ వెళ్ళాలి. కారులో బయలుదేరాం.

తోవలో వల్లూరులో రోడ్డుపక్క తోలుబొమ్మలాట జరుగుతోంది. మాతోవున్న సారస్వతేయుడు రాయలసీమవాడు. అదేమిటన్నాడు? తెగ ఆశ్చర్యపడిపోతూ- అనడమేమిటి డాక్టరుగారు కారుదిగేసి ఆయనతో బొమ్మలాట పందిరిలోకి వెళ్ళి నేపథ్యంలోకి ప్రాకి- ఆట పెద్దతో మాట్లాడి యోగక్షేమా లడిగి అక్కడి యిత్తడిచెంబుల్లోవి మంచినీళ్ళేనాని శంకించి బయటకొచ్చారు.

ఏటవాలుగా ఉన్న పందిరికి తెలివి తెర వెనక వేలాడే ఆముదం దీపాలు- తోలు కత్తిరించి అందంగా- అలంకారాలతో, హారాలతో, తయారుచేసిన ఆ బొమ్మలు దీపాల వెలుగులో ధగ ధగ మెరుస్తున్నాయి.

"రావణాసురుడు కిందమన్న బల్లలు తొక్కుతూ సీతామ్మవారిని గద్దిస్తున్నాడు. సీత బొమ్మవెనక కీచుగొంతుక ఒక పాటతో తిరస్కరిస్తోంది."

కారు మండపేటలో ఆగింది.

కందర్పవారింట మకాం. ఆ రాత్రికి అక్కడే అని డాక్టరుగారు ప్రకటించారు. 'చచ్చాం పో' అనుకున్నారు అనుయాయులు. మార్చుకోడానికి గుడ్డలులేవు. డాక్టరుగారు నిశ్చింతగా సూటు విడిచేసి ఖద్దరు శాలువా లుంగీగా చుట్టబెట్టారు.

'యథారాజా తథా ప్రజాః'

పైన బనియను. కింద శాలువా లుంగీలు.

బస్ - యూనిఫారంగా భజన సమాజంలా వున్నాం. డాక్టరుగారు మంచం మధ్యకూచుని కబుర్లు విడేశారు. తన చిన్నతనంలో- బొమ్మలాటలు- వాళ్ళ 'ప్రచ్చి ప్రచ్చని' సంస్కృతశబ్దాలూ - ఒకటే హాస్యోక్తులు. తెల్లారిపోయింది.

కారు డ్రైవరు చేతులుకట్టుకుని ఎదుట నుంచున్నాడు!